నమస్తే తెలంగాణ
# కరీంనగర్
3 | కరీంనగర్, బుధవారం 24 జూలై 2024 | KARIMNAGAR


### తెలంగాణకు అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు చెరో ఎనిమిది మంది ఉండి కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క రూపాయి తీసుకురాలేదు. దీన్ని బట్టే చూస్తుంటే వారికి ఈ ప్రాంతంపై ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలుస్తున్నది. ప్రసాద్ స్కీం ద్వారా కొండగట్టు, వేములవాడ, యాదాద్రి, ధర్మపురి దేవస్థానాలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిధులు తీసుకువస్తారని.. ఆయనపై పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయి. వేములవాడ రాజన్న దేవస్థానానికి వచ్చిన ప్రధాని మోదీ.. అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ ఏమైంది? కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, జాతీయ రహదారులు, రైల్వే లైన్‌కు నిధులు తేవాలనే సోయి కేంద్ర మంత్రులు, ఎంపీలకు లేదు. నిధుల కోసం కేంద్రంతో కొట్లాడే ఎంపీలే కరువయ్యారు. ఏపీ, బిహార్ ఎంపీలను చూసైనా నేర్చుకోవాలి. నిధులు తేకుండా వచ్చే ఎంపీలు.. రాష్ట్రంలో ఏ ముఖం పెట్టుకొని తిరుగుతారో వారికే తెలియాలి.

**- సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే (చొప్పదండి)**

## అంజమ్మకు అన్యాయం

### కేసీఆర్ పాలనలో రుణ మాఫీ.. కాంగ్రెస్ పాలనలో ధోకా



.. పక్క చిత్రంలో కనిపిస్తున్న మహిళా రైతు పేరు ఎర్ర అంజమ్మ. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్. ఆమె పేరు మీద తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకులో ₹70 వేల క్రాప్ లోన్ ఉన్నది. తొమ్మిది నెలల కింద తీసుకున్న అప్పు మాఫీ అయితదని ఎదురు చూసింది. తర్వాత మళ్లింత రుణం తీసుకొని పంట మీద పెట్టుబడి పెట్టాలని ఆశించింది. కానీ, కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో ఆందోళన చెందింది. ఎందుకు రాలేదని అధికారులను అడిగితే తమకేమీ తెలియదనే సమాధానం వచ్చింది. రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా తనకు వర్తించకపో వడంతో అంజమ్మ అసహనం వ్యక్తం చేస్తున్నది. ఇదే అంజమ్మకు కరీంనగర్‌లోని కేడీసీసీబీ బ్యాంక్‌లో ₹50 వేల రుణం ఉంటే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వడ్డీతో సహా చెల్లించింది. ఈ విషయమై అంజమ్మ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో తాము ఎక్కడికి వెళ్లకున్నా, ఎవరిని కలువకున్నా, ఎలాంటి పైరవీ లేకుండా తనకు రుణ మాఫీ జరిగిందని గుర్తు చేసుకున్నది. ఇప్పుడు వచ్చిన లిస్ట్‌లో తన పేరు లేదని, ఇంకొక లిస్ట్ ఉన్నదని అధికారులు చెబుతున్నారని, అయితే అందులో వస్తుందా..? లేదా..? అనే విషయంలో స్పష్టత లేదని చెబుతున్నది. **-కరీంనగర్, జూలై 23 (నమస్తే తెలంగాణ)**

# మళ్లీ నిరాశే

## కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు మొండిచెయ్యే

- నేతన్నను ఆదుకునేందుకు సాయం కరువే..
- ప్రస్తావన లేని మెగా పవర్‌లూం క్లస్టర్
- ట్రిబుల్ ఐటీ ఏర్పాటుకు దక్కని హామీ
- ఊసే లేని సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు
- వేతన జీవులకు మిగిలింది వేదనే
- కేంద్ర హోం శాఖ సహాయ శాఖ మంత్రి సంజయ్‌పై పెట్టుకున్న ఆశలు అడియాసలు
- పెదవి విరుస్తున్న మెజార్టీ వర్గాలు

**కేంద్రం బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు నిరాశే మిగిలింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 2024-2025 పద్దులో మొండి చెయ్యే దక్కింది. కొన్నేళ్లుగా కేంద్రం ముందు పెట్టిన ఏ ఒక్క ప్రతిపాదనకూ ఓకే చెప్పలేదు. కనీసం ఆ అంశాలను సైతం ప్రస్తావించలేదు. బండి సంజయ్ ప్రస్తుతం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు ఈసారి రైళ్లు, రోడ్లే కాకుండా మిగిలిన డిమాండ్లకు కూడా న్యాయం జరుగుతుందని ప్రజలంతా ఆశించినా.. చివరకు అడియాసే అయింది. ట్రిపుల్ ఐటీ, మెగా పవర్‌లూం క్లస్టర్, ఆదాయపన్ను మినహాయింపు లాంటి ఎన్నో డిమాండ్లు ఉన్నా ఏ ఒక్క దాని గురించి ప్రస్తావన లేకపోవడం నిరాశ పరిచింది. ఈ బడ్జెట్‌తో జిల్లాకు పెద్దగా ఒరిగిందేమీ లేదని ప్రజానీకం పెదవి విరుస్తున్నది.**



కరీంనగర్, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేంద్ర బడ్జెట్‌పై ఈసారి ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కేంద్రంలో బీజేపీ ఉండడం, ఈసారి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలిచిన బండిసంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కావడంతో చాలానే నమ్మకం పెట్టుకున్నారు. అదే సమయంలో ఉమ్మడి జిల్లాకు నిధులు, సాకర్యాల కోసం తన వంతు ప్రయత్నం చేస్తామని ఇటీవల జరిగిన సభలో ఆయన చెప్పడంతో ఈసారి తన పట్టు నిలుపుకొంటారని అంతా భావించారు. కానీ, మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024-2025 బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి చూపడంతో తీవ్ర నిరాశ చెందారు.

### ట్రిపుల్ ఐటీ ఊసే కరువు

ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో ట్రిపుల్‌ఐటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉన్నది. అందుకోసం మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. గతంలోనే మన ఉమ్మడి జిల్లాకు రావాల్సిన ట్రిపుల్ ఐటీని వేరే రాష్ట్రాలకు మళ్లించారని పేర్కొంటూ అప్పట్లోనే కేంద్రానికి లేఖ రాశారు. ఈసారి బడ్జెట్‌లోనైనా ఆ ప్రస్తావన వస్తుందని అందరూ ఆశించారు. కానీ, ఆ ఊసే ఎత్తలేదు. అలాగే, జిల్లాకో నవోదయ ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉన్నది. దాని ప్రకారం ఉమ్మడి జిల్లాకు చొప్పదండిలోని నవోదయ మినహాయిస్తే మూడు జిల్లాలకు మూడు నవోదయ పాఠశాలలు రావాలి. బడ్జెట్‌లో వీటి ప్రస్తావన లేదు. విద్యారంగానికి సంబంధించి రెండింటిలోనూ నిరాశే ఎదురైంది.

### చేనేతకు మొండి చేయి

సిరిసిల్ల కేంద్రంగా మెగా పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌ను ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్ కేంద్రం దృష్టికి పలుసార్లు తీసుకెళ్లారు. ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు. ఇదే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా డిమాండ్ చేశారు. ఈ విషయంపై బండి సంజయ్‌కు లేఖ సైతం రాశారు. ఒక వైపు నేతన్నలు అష్టకష్టాలు పడుతున్న నేపథ్యంలో ఈసారి సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్‌ను కేంద్రం ప్రకటిస్తుందని అందరూ ఆశించారు. కానీ, ఆ విషయంపై బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావన లేదు. అలాగే నేతన్నల వస్త్రాలు, ముడిసరకులపై జీఎస్టీ ఎత్తివేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉన్నా ఆ ఊసేలేదు. నేతన్నలను ఆదుకునేందుకు ఏ ఒక్క పథకాన్ని కూడా కేంద్రం ప్రకటించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.

### విమానాశ్రయం ఉత్తదే.. సింగరేణికి లేని భరోసా

బసంత్‌నగర్‌లో విమాశ్రయం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎన్నో ఏండ్ల నుంచి ఉన్నా దాని గురించి ప్రస్తావించలేదు. నాలుగేళ్ల కింద లైడార్ సర్వే నిర్వహించినా.. నేటికీ మోక్షం కలుగలేదు. రామగుండంలో బీపీఎల్ కింద సేకరించిన 1800 ఎకరాల్లో రైల్వే కోచ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను కూడా ఏమాత్రం పరిగనలోకి తీసుకోలేదు. అలాగే, సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏకంగా అసెంబ్లీ తీర్మానం చేసి పంపింది. ఈసారైనా న్యాయం జరుగుతుందని ఆశించినా కార్మికులకు మళ్లీ నిరాశే మిగిలింది. ఏళ్లుగా ఉన్న డిమాండ్‌ను ఈసారి కూడా పరిగనలోకి తీసుకోకపోవడంపై కార్మికులు మండిపడుతున్నారు.

### వేతన జీవులకు ఆవేదనే

ఈ బడ్జెట్ వేతన జీవులకు మళ్లీ నిరాశే మిగిల్చింది. పాత స్లాబ్‌ను యథాతథంగా ఉంచిన కేంద్రం.. కొత్త స్లాబ్‌లో స్వల్ప మార్పులు చేసింది. అయితే, దీని ద్వారా పెద్దగా ప్రయోజనం చేకూరదని వేతన జీవులు పేర్కొంటున్నారు. పెరుగుతున్న ధరలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదని, జీతాలు పెంచినా అవి టాక్సు రూపంలో వెళ్లిపోతున్నాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ధరలు, మరోవైపు అవసరాలు పెరుగుతున్నాయని చెబుతున్న కేంద్రమే.. ఆదాయ పన్ను విషయంలో మాత్రం మొండి వైఖరిని అవలంభిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రాజన్నకు నిధుల్లేవ్

ప్రధాని మోదీ పార్లమెంట్ ఎన్నికల ముందు అంటే మే 8న వేములవాడకు వచ్చారు. 77 ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో మొట్టమొదటగా ప్రధానమంత్రి హోదాలో రాజన్నను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో మోదీ అధికారంలోకి వస్తే రాజన్న ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని అందరూ భావించారు. ఆ మేరకు తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని అంతా ఆశించారు. కానీ, చివరకు నిరాశే మిగిలింది. ప్రసాద్ స్కీం ద్వారా కొండగట్టు, వేములవాడ, యాదాద్రి, ధర్మపురి దేవస్థానాలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిధులు తీసుకువస్తారని ఆశించినా ఫలితం లేకపోయింది. పదే పదే దేవుళ్ల గురించి మాట్లాడే సంజయ్ దేవస్థానాలకు ఒక్క రూపాయి కూడా తీసుకు రాకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

### మరీ ఇంత అన్యాయమా..?



రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను ఇచ్చిన తెలంగాణకు కేంద్రం పూర్తిగా అన్యాయం చేసింది. బడ్జెట్‌లో వివక్ష స్పష్టంగా కనిపించింది. తీర్చాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నా, ఏ ఒక్కటీ పట్టించుకోలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణపై పూర్తి వివక్ష కనిపిస్తోంది. గతంలో ప్రవేశపెట్టిన ఏ బడ్జెట్ లోనూ ఇంత అన్యాయం ఎప్పుడూ జరుగలేదు. ఈసారి బీజేపీ సర్కారు తెలంగాణపై కక్షగట్టినట్లు కనిపించింది.

**- తాటిపెల్లి సుభాష్, వైశ్య సేవా కేంద్రం డైరెక్టర్ కరీంనగర్**

### టాక్స్ రేటు పెంచడం బాధాకరం



షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ కాపిటల్ గేయిన్ టాక్స్ రేటు పెంచడం బాధాకరం. దీని వల్ల ఇన్వెస్టర్లకు నష్టం జరుగుతుంది. ముందుకు వెళ్లేందుకు ఆలోచిస్తారు. ఆదాయ పన్నులో వేతన జీవులకు కొంత ఊరట కలిగించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే దీని ద్వారా పెద్దగా మేలు జరగదన్న అభిప్రాయం ఉంది. అలాగే ఫ్యామిలీ పెన్షన్స్ స్కీమ్‌లో ₹15 వేల నుంచి ₹25వేలకు పెంచడం కొంత ఊరటనిస్తోంది.

**- కే వేంకటేశ్వర్లు, టాక్స్ కన్సలెంటెంట్ (కరీంనగర్)**

### విద్యారంగానికి గుర్తింపు కరువు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని గుర్తించలేదు. గత బడ్జెట్ కేటాయింపులో కన్నా ₹4వేల కోట్లు తగ్గించింది. తెలంగాణ విభజన హామీ మేరకు కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ మంజూరు చేయాల్సి ఉన్నా మొండి చేయి చూపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ట్రిపుల్ ఐటీ మంజూరు చేయించడంలో విఫలమయ్యారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. రాష్ట్రానికి ప్రయోజనం లేదు. తెలంగాణకు నిధుల కేటాయింపులో అన్యాయం జరిగింది. రాష్ట్ర బీజేపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేయాలి.

**- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు (కరీంనగర్ తెలంగాణచౌక్)**

### సామాన్యులకు ఒరిగిందేమీ లేదు



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మళ్లీ మొండిచెయ్యే చూపింది. తెలంగాణపై కేంద్రానికి చిత్తశుద్ధిలేదు. ఇక్కడ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో నేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అడుగుతున్నా.. మెగా టెక్స్‌టైల్ పార్కు కూడా మంజూరు చేయలేదు. బడ్జెట్‌తో సామాన్యుడికి ఒరిగేదేమీలేదు. అంతా బడా వ్యాపారులకే మేలు చేసేలా ఉంది.

**- చింతోజు భాస్కర్, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు (రాజన్న సిరిసిల్ల)**

### రాష్ట్రంపై కేంద్రం వివక్ష



కేంద్ర ప్రభుత్వం మరోసారి తెలంగాణపై వివక్ష చూపింది. తెలంగాణ ప్రాంతానికి మొండిచేయి చూపడం బాధాకరం. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా.. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు నోరుమెదపకపోవడం సిగ్గుచేటు. ఏపీ అభివృద్ధికి రూ.15వేల కోట్ల బడ్జెట్ కేటాయించి.. తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం అన్యాయం. మన ప్రాంతం-మన హక్కులు సాధించాలంటే కేసీఆర్ వంటి బలమైన నాయకత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలువాలి.

**- కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు (గోదావరిఖని)**

### ఎనిమిది మంది ఉన్నా.. నిధులు తేలేదు



తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచి కూడా కేంద్రం నుంచి నిధులు తేవడంలో రాష్ట్రానికి అన్యాయం చేశారు. కరీంనగర్ రైల్వేలైన్‌కు నిధులు తీసుకురాలేక పోవడం కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పనితనానికి నిదర్శనం. ఆలయాలకు కూడా నిధుల్లేవు. 16మంది ఎంపీలు ఉన్న చంద్రబాబునాయుడు అమరావతికి ₹15వేల కోట్లు తీసుకెళ్లిండు. ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ణాటక వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను కూడా కేంద్రం ప్రకటించడం తెలంగాణకు మొండిచెయ్యి ఇవ్వడమే. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల అసమర్థతను ప్రజలు నిలదీసే రోజులొచ్చాయి.

**- చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి**

### రాష్ట్రానికి మొండిచెయ్యే



తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యే చూపింది. ఉత్తరాది రాష్ట్రాలతోపాటు దక్షిణాదిన ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పెద్దపీట వేసింది. రాష్ట్రం నుంచి ఎనిమిది ఎంపీ సీట్లను ఇస్తే, నిధులు ఇవ్వకుండా అవమానపరచడం సరికాదు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేసి, రాష్ట్రానికి న్యాయం చేయాలని అనేకసార్లు కేంద్రాన్ని కోరారు. కానీ, పట్టించుకోలేదు. కనీసం ఈసారైనా బడ్జెట్‌లో మన తెలంగాణ రావాల్సిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయలే. పోలవరం కోసం ప్రత్యేక నిధులు ఇచ్చినట్లు మన సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక నిధుల కేటాయిస్తారని, కాళేశ్వరంకు జాతీయ హోదా ఇస్తారని ఆశించాం. కానీ, నిరాశే మిగిల్చింది.

**- గుంజపడుగు హరిప్రసాద్, కరీంనగర్**

### వేతన జీవులకు నిరాశే..



వేతన జీవులకు మళ్లీ నిరాశే ఎదురైంది. పదేండ్లుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఆదాయ పన్ను స్లాబులలో పెద్దగా మార్పులు తీసుకురాకపోవడం దురదృష్టకరం. పన్ను రహిత ఆదాయాన్ని ₹2.5లక్షల నుంచి ₹3లక్షల వరకే పెంచడం సరికాదు. ఈ ప్రక్రియ చాలా అశాస్త్రీయం. పన్ను రహిత ఆదాయాన్ని ₹8లక్షలకు, స్టాండర్డ్ డిడక్షన్ ₹2లక్షల వరకు పెంచాల్సింది పోయి, ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. పాత పన్ను స్లాబులలో ఎలాంటి మార్పులు చేయకపోవడం సరికాదు. దీనిపై కేంద్రం ఆలోచించాలి.

**- చందూరి రాజిరెడ్డి, తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

### పెన్షనర్లకు నిరాశే



కేంద్ర బడ్జెట్ పెన్షనర్లను తీవ్రంగా నిరాశపర్చింది. ఎనిమిదేండ్లుగా ఉద్యమాలు చేస్తూ పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా పోస్ట్ కార్డులపై వినతులు పంపించాం. ప్రతినెలా ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతిపై ఆదాయపు పన్ను విధించడం సరికాదు. కనీసం పరిమితిని సైతం ఉద్యోగులు, పెన్షనర్లకు పెంచకపోవడం శోచనీయం. మినహాయింపు చేసేంతవరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతాయి.

**- హరి అశోక్‌కుమార్, టీ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు (జగిత్యాల)**




ముస్తాబాద్‌లో కేటీఆర్ పేరులోని అక్షరాలతో బర్త్‌డే శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

## హ్యాపీ బర్త్‌డే రామన్న

### ముస్తాబాద్‌లో ముందస్తు వేడుకలు

ముస్తాబాద్, జూలై 23: యంగ్ డైనమిక్ లీడర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలను ముస్తాబాద్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్‌ఎస్‌వీ నాయకులు, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. బీఆర్‌ఎస్వీ నాయకులు వివిధ ప్రాంతాల్లో కేటీఆర్ పేరులోని అక్షరాలను ఒంటిపై అచ్చువేయించుకొని 'హ్యాపీ బర్త్‌డే కేటీఆర్ అన్న' అంటూ ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో కేటీఆర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కంచం నరసింహులు, ఎండీ జహంగీర్, కొత్తపెల్లి నారాయణ, తాడెపు అనిల్, వకీల్, వంగూరి దిలీప్, మల్లారెడ్డి, కోడె శ్రీను, బర్కుటి శంకర్, పుల్లూరి శ్రీనివాస్, గడిచెర్ల భరత్, సతీశ్, శ్రవణ్, సుంచు సుదర్శన్, గొండయ్య, మాడూరి శ్రీనివాస్ వెంకటేశ్, బాలచంద్రం, సంజీవ్, బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు నవాజ్, భరత్, నందు, యాదగిరి పాల్గొన్నారు.

## బీఈడీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, జూలై 23 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్టు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.























